ఆకతాయిలతో భయం భయం

ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరుగా చెప్పుకునే అల్లిపురం.. గీత్–సంగీత్ థియేటర్ల రహదారి.. కెప్టెన్ రామారావు జంక్షన్ తదితర ప్రాంతాలు ఇప్పుడు ఆకతాయిలు.. గంజాయి బ్యాచ్‌ల సంచారంతో భీతి గొల్పుతున్నాయి. ఈ ప్రాంతంలో గంజాయి సేవించిన యువకులు దొంగతనాలు, దౌర్జన్యాలకు పాల్పడటం, పర్సులు కొట్టేయడం, ఒంటరి యువతులపై వేధింపులకు పాల్పడటం చేస్తున్నారు. అడిగిన వారిపై రాళ్లతో దాడులకు దిగుతున్నారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వారు భయపడటం లేదు. పోలీస్ నిఘా పెంచి వారి ఆటలు కట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

- గంజాయి మత్తులో దౌర్జన్యాలకు పాల్పడుతున్న యువకులు
- నిలదీసిన వారిపై రాళ్లతో దాడి
- పోలీస్ నిఘా పెంచాలని స్థానికుల డిమాండ్


ఆకతాయిలు తిరుగుతున్న గీత్ సంగీత్ థియేటర్లకు వెళ్లే రోడ్డు

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కెప్టెన్ రామారావు జంక్షన్, గీత్ సంగీత్ థియేటర్ల రోడ్డులో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి మత్తులో కొంత మంది యువకులు రోడ్డున పోయే వారిని డబ్బులు ఇమ్మని బెదిరిస్తున్నారని, అడ్డం తిరిగితే మూకుమ్మడిగా దాడికి పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పలుమార్లు నిఘా ఏర్పాటు చేసినా ఆకతాయిలు తమ పని తాము చేసుకుపోతున్నారని వాపోతున్నారు.

ఒంటరిగా వెళ్లే వారే లక్ష్యం..

కెప్టెన్ రామారావు జంక్షన్, గీత్ సంగీత్ థియేటర్ల రోడ్డు, బృందావన్ జంక్షన్‌లో టీ, టిఫిన్ దుకాణాల వద్ద ఎక్కువగా టూరిస్టులు టిఫిన్లు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో గల లాడ్జిలలో వెస్ట్ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల టూరిస్టులు దిగుతుంటారు. అరకు, పాడేరుతో పాటు నగరంలో చూడాల్సిన ప్రదేశాలకు ఇక్కడి నుంచే వెళ్తుంటారు. వారు టిఫిన్ల కోసం స్థానికంగా గల టిఫిన్ సెంటర్లకు వచ్చినప్పుడు వారి పక్కనే నిలబడి పర్సులు, హ్యాండ్ బ్యాగులు దొంగిలించుకుపోవడం చేస్తుంటారు. కుదరకపోతే వారితో గొడవపడి డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో టూరిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మాయిలు కనిపిస్తే చాలు..

ఈ రహదారిలో అమ్మాయిలు కనిపిస్తే చాలు వారితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిర్మానుష్యంగా ఉన్నప్పుడు ఒంటరి మహిళలు, అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారు. ఇటీవల ఒకమ్మాయిని తండ్రి ఉండగానే ఏడిపించటం కొసమెరుపు. స్థానికులు వారిని వారించగా వారిపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. వారితో గొడవెందుకని అమ్మాయిని తీసుకుని తండ్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సీసీ కెమెరాలు ఉన్నా..

ఈ జంక్షన్‌లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఆకతాయిల గొడవ తప్పటం లేదని స్థానికులు వాపోతున్నారు. గంజాయి తాగి ఉన్న యువకులు గుంపులుగా తిరుగుతూ స్థానికంగా నిలిపి ఉంచిన కార్ల అద్దాలు పగులగొట్టడం, డబ్బుల కోసం దారిన పోయేవారిని వేధించడం పరిపాటయిందని స్థానికులు చెబుతున్నారు.


కెప్టెన్ రామారావు జంక్షన్


చెట్ల చాటున గల సీసీ కెమెరాలు

ఆకతాయిల బెడద ఎక్కువైంది..



ఈ ప్రాంతంలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంది. ముఖ్యంగా గత పదిహేను రోజుల నుంచి గంజాయి తాగిన వారు గుంపులుగా తిరుగుతున్నారు. ఒంటరిగా వెళ్తున్న వారిని అడ్డుకుని వారి వద్ద నుంచి డబ్బులు లాక్కుంటున్నారు. పోలీసులు వారిపై నిఘా ఏర్పాటు చేయాలి.

– కె.కామేశ్వరశర్మ, కెప్టెన్ రామారావు జంక్షన్

కార్ల అద్దాలు పగులగొడుతున్నారు..



లాడ్జిల్లో టూరిస్టుల కోసం నిలిపి ఉంచిన టాక్సీల అద్దాలు పగులగొడుతున్నారు. టూరిస్టుల పర్సులు దొంగిలిస్తున్నారు. అడిగితే వారిపై తిరగబడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఇది మరీ ఎక్కువైపోయింది. ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పోలీసు వారు నిఘా ఏర్పాటు చేస్తే మంచిది.

– రవిశంకర్, స్థానికుడు

రాళ్లతో దాడి చేస్తున్నారు..



దారిన పోయేవారిని ఆకతాయిలు అడ్డుకుంటుంటారు. అది మంచిది కాదని చెప్పిన వారిపై రాళ్లతో దాడికి దిగుతున్నారు. నువ్వెవరు మమ్మల్ని అడగడానికి అని గుంపుగా మీద పడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయంగా ఉంటుంది.

– బొడ్డు పోలారావు, కెప్టెన్ రామారావు జంక్షన్

స్పెషల్ టీమ్‌లతో పర్యవేక్షిస్తున్నాం..

ఆకతాయిలను నిలువరించేందుకు ఎస్‌ఐ స్థాయి వ్యక్తితో స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. నిరంతరం నిఘా ఉంటుంది. అనుమానం వచ్చిన వ్యక్తులను వదలి పెట్టేది లేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి సెంట్రల్ పార్కు వద్ద, అనుమానిత ప్రదేశాల్లో స్పెషల్ టీమ్స్‌తో పర్యవేక్షిస్తున్నాం.

– బి.తిరుమలరావు, సీఐ, టూటౌన్

క్లుప్తంగా

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నాగభూషణం తదితరులు

అల్లిపురం: మలేరియా మాసోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శనివారం భీమ్‌నగర్ సబ్ యూనిట్ ఆఫీసర్లు పట్నాయక్, శేషుబాబు ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, హెల్త్ సూపర్‌వైజర్లు వి.మోహన్‌దత్త, కేఎస్‌వీ కుమార్, రఘు, హెల్త్ అసిస్టెంట్లు అప్పారావు, రమేష్, సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం


పదవీ విరమణ చేసిన పారిశుధ్య కార్మికులతో అధికారులు

జగదాంబ: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయంటే దానికి పారిశుధ్య కార్మికులే కారణమని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ప్రసాదరావు అన్నారు. శనివారం జోన్ పరిధిలో ఎనిమిది మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ ప్రసారావు, ఏఎంహెచ్‌వో రాజేష్ వారిని సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ జీవీఎంసీలో పారిశుధ్య కార్మికుల పాత్ర గొప్పదన్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో వారు నగర పరిశుభ్రతతకు పాటు పడుతున్నారని అన్నారు. పదవీ విరమణ చేసిన వారు సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గన్నారు.

కేజీహెచ్ మేనేజర్‌కు అభినందనలు


జవహర్‌లాల్‌ను అభినందిస్తున్న అతిథులు

మహారాణిపేట: కేజీహెచ్ ఆస్పత్రి మేనేజర్ గాజె.ఎం.జవహర్‌లాల్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనను హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ భూతం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం అభినందించారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బలివాడ రవి, డి.రాజు, సుభాన్, సుగీత, భవానీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొయ్యి తీసి.. వదిలేశారు


బౌడారా రోడ్డులో తీసిన గొయ్యి

జగదాంబ: ప్రధాన రహదారిపై విద్యుత్ అధికారులు తీసి వదిలేసిన గొయ్యి ప్రమాదకరంగా మారిందని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. పూర్ణామార్కెట్ దరి బౌడారారోడ్డులోని నూనెమిల్లు వీధికి వెళ్లే దారికి ఎదురుగా విద్యుత్ శాఖ అధికారులు భూగర్భ కేబుల్ పనుల కోసం పెద్ద గొయ్యి తవ్వారు. అయితే వారం పది రోజులు కావస్తున్నా కేబుల్ పనులు చేయలేదు. తీసిన గొయ్యి పూడ్చకుండా అలాగే ఉండిపోయింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు, హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు సంకటంగా మారింది. అలాగే ఆ రహదారిపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు కూడా ఇది ఇబ్బందికరంగా తయారయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తవ్వి వదిలేసిన గొయ్యిని వెంటనే పూడ్చాలని వ్యాపారులు, వినియోగదారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

కూలిన ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ గోడ


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కూలిపోయిన గోడ

జగదాంబ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కోసం నిర్మించిన గోడ కూలిపోవడంతో భయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిర్మించిన గోడను గుర్తు తెలియని వాహనం ఢీకొని గోడ కూలిపోయింది. దీంతో రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్తుంటే భయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ రహదారి పక్కనే ఉండడంతో వాహన చోదకులు, చుట్టుపక్కల నివసించే స్థానికులు, చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు


విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి


స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

అల్లిపురం: బల్లిగిరి వెంకటేశ్వరమెట్ట దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు రమణ (ఫైల్)

అల్లిపురం: ఈ నెల 24న చినముషిడివాడకు చెందిన రమణ అనే వ్యక్తి ఆర్టీసీ కాంప్లెక్స్ దరి, లలితా జ్యూయలర్స్ బస్టాపు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని కొంత మంది గుర్తించారు. దాంతో టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేసి అంబులెన్స్‌లో ఆ వ్యక్తిని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను ఈ నెల 26వ తేదీన మరణించాడు. చనిపోయిన వ్యక్తిది చినముషిడివాడ అని, అతనికి ఇద్దరు కుమారులున్నారని, వారు పోర్టులో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం అందింది. చనిపోయిన వ్యక్తి సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి, 5.5 అడుగుల ఎత్తు, చామన ఛాయతో, నీలం రంగు షర్ట్ మీద నల్లరంగు గీతలున్న ఫ్యాంట్ వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9490391090, 0891–2783672 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

50 లక్షల మొక్కలు నాటి పెంచండి

సీతమ్మధార: విశాఖలో 50 లక్షల మొక్కలు నాటి, వాటిని పెంచి, 5 వేల టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేద్దామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో శనివారం ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విజయకుమార్‌కు గ్రీన్ క్లైమేట్ టీం ఔషధ మొక్కలు, పువ్వుల మొక్కలను అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామన్నారు. ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ భూగోళం మీద సమస్త జీవరాశిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిదేనన్నారు. ప్రకృతి ఆధారిత పంటల ఆహారాన్నే ఆరగించాలని సూచించారు. జీవీఎంసీ ఎస్ఆర్‌యూ ప్రతినిధి అక్షత మాట్లాడుతూ విశాఖలో అమలవుతున్న ఎకో వైజాగ్‌లో భాగంగా మొక్కలు నాటి, పెంచే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం స్కూల్ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌యూ ప్రతినిధులు ప్రమీల, వివేక్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ టీచింగ్ ఫ్యాకల్టీ శివలక్ష్మి, జోషఫ్ నవీనా, బి.జ్యోతి, ఫర్జానా బేగం పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న బీవీపీ ప్రతినిధులు

అల్లిపురం: రక్తహీనత వల్ల మహిళల్లో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రతి మహిళా తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని కేజీహెచ్ వైద్యురాలు డాక్టర్ డి.లక్ష్మీ తులసి అన్నారు. ఎంవీపీ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్, పరిషత్ ఝాన్సీ లక్ష్మీబాయి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు బిడ్డ పుట్టే వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పరిషత్ ప్రతినిధులు మహిళలకు విటమిన్ టాబ్లెట్లు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిల్ సెట్లు, చాక్లెట్లు, బిస్కట్లు అందజేశారు. పరిషత్ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్ చంద్ జైన్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేవీ సత్యవేణి, పరిషత్ ప్రతినిధులు సీహెచ్‌వీ సత్యనారాయణ, పి.షర్మిల, ఎంవీ రాజశేఖర్, కె. రామ్‌కుమార్, పి.వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను పక్కాగా గుర్తించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మొదటి విడతగా 73 కేసులను గుర్తించామన్నారు. కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బందిని వినియోగించుకుని కచ్చితమైన కేసులను గుర్తించాలన్నారు. జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు కుష్టువ్యాధిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఆశ కార్యకర్తలు, వలంటీర్ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.సత్యవేణి, నోడల్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

7న లతారాజా ఫౌండేషన్ స్కాలర్‌షిప్ పరీక్ష



స్కాలర్‌షిప్ పరీక్షల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సిద్ధోజీరావు, రాజా

అల్లిపురం: విద్య, వైద్య, సామాజిక రంగాల్లో దేశవ్యాప్తంగా విశిష్ట సేవలందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన లతా రాజా ఫౌండేషన్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్‌లు అందించనుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.కె. రాజా తెలిపారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కాలర్‌షిప్‌కు సంబంధించిన పరీక్ష జూలై 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ట్రస్టీ డాక్టర్ సిద్ధోజీరావు మాట్లాడుతూ కె.కె. రాజా సతీమణి లత జ్ఞాపకార్థం ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా విద్య, వైద్యం, సామాజిక రంగాలకు అంకితమై నిస్వార్థ సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ప్రతి ఏడాది జాతీయ సేవా ధార్మిక పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగి ఉత్సాహం గల యువతీ యువకులు 9866870179, 8142657359 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీ స్టడీ సర్కిల్ మాజీ డైరెక్టర్ ఎస్.సిద్ధోజీరావు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు.. భవితకు వెలుగు


మధురానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు


సీతంపేట: విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ప్రభుత్వ పాఠశాలలే అని ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్, మండల విద్యా శాఖ అధికారులు డి.రామారావు, బాలామణి అన్నారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాల్లో శనివారం 'నేను బడికి పోతా' ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యా శాఖ ఏఎస్‌వో గీత, ఏపీవో అప్పలనాయుడు, హెచ్‌ఎం బి.దేముడుబాబు, ఉపాధ్యాయ సిబ్బంది అందరూ కలిసి ర్యాలీ చేశారు. మధురానగర్, శాంతిపురం, రాజేంద్రనగర్, సీతంపేట ప్రాంతాల్లో జరిగిన ర్యాలీలో బడి బయట ఉన్న నలుగురు విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సదుపాయాలు, అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య పరీక్షలు, స్టూడెంట్ కిట్, ఇంగ్లిష్ మీడియం బోధన, ఇతర విద్యా ప్రమాణాలను వివరించి బడిలో చేర్పించాలని కోరారు. కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేరాలని, వారి బంగారు భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని బడికి పంపించాలని కోరారు.


దేశ ప్రగతికి గణాంకాలే కీలకం

అల్లిపురం: దేశం ప్రగతి పథం వైపు పయనించాలంటే గణాంకాలే కీలకమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జనరల్ పాపులేషన్స్, సెన్సెస్ డిప్యూటీ రిజిస్ట్రార్ టీఎల్ఎన్ శివకుమార్ అన్నారు. ప్రశాంత చంద్ర మహాలోనబిస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 18వ జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. నేషనల్ శాంపిల్స్ సర్వే, మిసెస్ ఏవీఎన్ కళాశాల యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా ముందుగా ఆస్తుల గణన పక్కాగా జరగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ దేశం గురించి ప్రతి విద్యార్థి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాటస్టికల్ ఆఫీసర్ స్వామి, గంగాధర్, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం


నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, అక్షింతలను అందజేశారు.

ఘనంగా సహస్ర నామార్చన

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలను పఠిస్తూ స్వామి వారికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం అందజేశారు.

రాజీమార్గమే ఉత్తమం

గాజువాక : కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడానికి రాజీమార్గాన్ని అనుసరించడం ఎంతో ఉత్తమమని 13వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు అన్నారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంతాలకు పోయి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయంతో పాటు ఆర్థికంగా కూడా చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఈ ఇబ్బంది తగ్గుతుందని, కక్షిదారుల మధ్య మంచి సంబంధాలు ఉంటాయని అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడానికి వచ్చిన కక్షిదారులను ఈ సందర్భంగా అభినందించారు.

5 బెంచీల్లో 178 కేసుల పరిష్కారం

కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన లోక్ అదాలత్ శిబిరంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా న్యాయమూర్తులు 178 కేసులను పరిష్కరించారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్, యాక్సిడెంట్, బీమా తదితర రూ.5.42 కోట్ల విలువైన కేసులను పరిష్కరించినట్టు కోర్టువర్గాలు తెలిపాయి. న్యాయమూర్తులు ఐదు బెంచీలను ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, పి.ప్రదీప్, కార్యవర్గ సభ్యులు బి.ప్రభాకరరావు, పి.పుల్లయ్య నాయుడు, ఏపీపీ వాణి తదితరులు పాల్గొన్నారు.